

హైదరాబాద్ వార్త


# విలీనం లాభమా..నష్టమా?

**-మున్సిపాలిటీల ప్రజలల్లో జోరుగా చర్చ**
**-ఓవైపు భూములు రేట్లు పెరుగుతాయన్న ధీమా**
**-మరోవైపు పన్నుభారం పెరుతుందనే ఆందోళన**




**హైదరాబాద్,నవంబర్ 29,ప్రభాతవార్త:** ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 27 మున్సిపాలిటీలు,కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే... ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధి సుమారు మూడింతలు పెరగనుంది. విలీనం వల్ల శివారు ప్రాంతాలకు మెరుగైన మౌలిక వసతులు, అభివృద్ధి లభిస్తుంది. అయితే, ప్రజలపై ఆస్తి పన్ను భారం పెరుగుతుందనే ఆందోళన ఉంది. వీటితో పాటు.. విలీన ప్రాంతాల్లో భూముల రేట్లు పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ పరిపాలనా స్వరూపంలో పెను మార్పులు రానున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు ఈ విలీనంతో జీహెచ్ఎంసీ ఇప్పుడు మెగా సిటీగా అవతరించనుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధి 650 చదరపు కిలోమీటర్లు ఉండగా.. విలీనం తర్వాత ఇది దాదాపు మూడింతలు పెరిగి సుమారు 2,000 చదరపు కిలోమీటర్లకు చేరనుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జీహెచ్ఎంసీ జనాభా 67.31 లక్షలు కాగా.. ప్రస్తుతం కోటి 40 లక్షలకు చేరినట్టు అంచనా. ఈ 27 స్థానిక సంస్థల విలీనంతో జీహెచ్ఎంసీ జనాభా కోటి 70 లక్షలకు చేరుతుందని మున్సిపల్ అధికారులు అంచనా వేశారు.కొత్తగా ఇబ్రహీంపట్నం, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాలు జత కలవనున్నాయి. అలాగే లోక్‌సభ స్థానాల జాబితాలో భువనగిరి కూడా చేరే అవకాశం ఉంది. ప్రస్తుతమున్న 150 డివిజన్ల సంఖ్య విలీనం తర్వాత 250-300కు పెరిగే అవకాశం ఉంది.

**ఎవరికి లాభం, ఎవరికి నష్టం..?**

మున్సిపాలిటీల విలీనంపై ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. శివారు ప్రాంతాలకు జీహెచ్ఎంసీ తరహాలో మెరుగైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధం, నీటి సరఫరా వంటి మౌలిక వసతులు అందుతాయి. చిన్న మున్సిపాలిటీలు సొంతంగా భరించలేని భారీ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయి. అభివృద్ధిలో వెనుకబడిన జవహర్‌నగర్, జల్‌పల్లి, తుక్కుగూడ వంటి మున్సిపాలిటీలకు జీహెచ్ఎంసీ నిధులు లభించి. త్వరితగతిన అభివృద్ధి చెందే అవకాశం ఉంది. పాలనా సౌలభ్యం కోసం మొత్తం ప్రాంతాన్ని ఆరు జోన్లుగా విభజించి ఎక్కడికక్కడ కమిషనర్లు, కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలనే నిపుణుల సూచనలు అమలైతే.. పాలన మరింత సమర్థవంతంగా మారుతుంది.

**భూమిరేట్లు పెరిగే అవకాశం..**

జీహెచ్ఎంసీ పరిధి విస్తరణ కారణంగా భూముల రేట్లు పెరిగే అవకాశం కచ్చితంగా ఉంది. దీనికి ప్రధాన కారణాలు ఏంటంటే.. జీహెచ్ఎంసీలో విలీనం కావడం వల్ల ఆ ప్రాంతాలకు నగరపాలక సంస్థ హోదా లభిస్తుంది. ఇది స్థిరాస్తి విలువను పెంచుతుంది. జీహెచ్ఎంసీ నిధులు, అభివృద్ధి ప్రణాళికలు అమలులోకి రావడం వల్ల మౌలిక వసతులు మెరుగుపడి, నివాసయోగ్యత పెరుగుతుంది. మెరుగైన మౌలిక వసతులు, పాలనా వ్యవస్థ కారణంగా ప్రజలు ఆ ప్రాంతాల్లో స్థిరనివాసం ఏర్పరచుకోవడానికి ఆసక్తి చూపుతారు.. తద్వారా స్థానిక భూముల డిమాండ్ పెరిగి రేట్లు పెరుగుతాయి. విలీనం తర్వాత డివిజన్ల పునర్విభజన, పాలనా సౌలభ్యం కోసం ఆరు జోన్ల ఏర్పాటు వంటి సవాళ్లను ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించినప్పుడే.. ఈ బృహత్‌నగరం పాలనా గాడిలో పడి, స్థిరమైన అభివృద్ధిని సాధించగలదు.

**మూడు కార్పొరేషన్లుగా జిహెచ్ఎంసి..?**

ప్రస్తుతం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిని ఆధారంగా చేసుకుని మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో స్థానికంగా ఆస్తిపన్ను, భవన నిర్మాణ అనుమతుల జారీ, ఇతర వనరుల ద్వారా వచ్చే ఆదాయం ఎంతన్నది పరిగణనలోకి తీసుకోనున్నారు. పన్ను ఎక్కువగా వసూలయ్యే, వసూలు కాని ప్రాంతాలు కార్పొరేషన్ పరిధిలో ఉండేలా చూడాల్సి ఉంటుందని, అప్పుడే అభివృద్ధిలో అసమానతలు ఉండవని అధికారులు తెలుపుతున్నారు. బల్దియా పాలకమండలి గడువు ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఉంది. శివారు కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తక్షణ విలీనానికి న్యాయపరమైన ఇబ్బందులుంటాయా? అన్నది పరిశీలించి ముందుకు వెళ్ళాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# ఆటోమేటెడ్ స్మార్ట్ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సౌకర్యం ప్రారంభం

**- గ్రేటర్ హైదరాబాద్‌లో ఇలాంటివి మరిన్ని నిర్మిస్తాం - నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**



ఆటోమేటెడ్ స్మార్ట్ కార్ పార్కింగ్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపి అనీల్‌కుమార్ యాదవ్, శ్రీలత, వెల్దండ వెంకటేష్.

**జూబ్లీహిల్స్, నవంబర్ 29, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగానే గ్రోయింగ్, హ్యాపెనింగ్ సిటీ హైదరాబాద్‌లోనీ అత్యంత రద్దీగల కేబిఆర్ పార్క్ వద్ద ఆటోమేటెడ్ స్మార్ట్ కార్ పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. కేబిఆర్ పార్క్ వద్ద జీహెచ్ఎంసీ, నవ నిర్మాణ్ అసోసియేట్స్ సంయుక్త అధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆటోమేటెడ్ స్మార్ట్ కారు పార్కింగ్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి , అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి, స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌లతో కలిసి ప్రారంభించారు. మేయర్ వాహనంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి,ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి లు కూర్చుని ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ కార్ పార్కింగ్ లో పార్క్ చేసే విధానం , పనితీరును స్వయంగా పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధిక వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ కు పేరుందన్నారు. ఈ మహానగరం సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేకకార్యక్రమాలను చేపడుతున్నారని మేయర్ కొనియాడారు. వారి ఆలోచనలకు అనుగుణంగానే జీహెచ్ఎంసీ అధునాతన మల్టీ లెవెల్ స్మార్ట్ కారు పార్కింగ్ వ్యవస్థకు అనుమతి ఇచ్చామన్నారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ అమోదం తెలిపిన 6 నెలల స్వల్ప కాలంలోనే నవ నిర్మాణ్ అసోసియేట్స్ అధునాతన మల్టీలెవెల్ పార్కింగ్ వ్యవస్థను అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ లోని పర్యాటక ప్రదేశాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర రద్దీ గల ప్రదేశాలలో ఇలాంటివి మరిన్ని ఆటోమేటెడ్ స్మార్ట్ రోటరీ కార్ పార్కింగ్ లు పీపీపీ మోడల్ లో నిర్మిస్తామన్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ కారులు నిలిపేలా నిర్మించే మల్టీ లెవెల్ స్మార్ట్ కార్ పార్కింగ్ తో నగరంలో వాహన దారులకు , పాదచారులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పార్కింగ్ కష్టాలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు, పార్కింగ్ కష్టాలు దూరం చేసేందుకు సీఎం ఆలోచనల మేరకు జీహెచ్ఎంసీ సౌజన్యంతో నిర్మించిన ఆటోమేటెడ్ స్మార్ట్ కార్ పార్కింగ్ లు మరిన్ని రావల్సి ఉందన్నారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ...జీహెచ్ఎంసీ సౌజన్యంతో నిర్మించిన ఆటోమేటెడ్ స్మార్ట్ కార్ పార్కింగ్ లతో వాహనదారుల పార్కింగ్ కష్టాలు తీరతాయని చెప్పారు.

# దివ్యాంగులు క్రీడల్లో రాణించాలి

**-మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలి**
**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**




క్రీడల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

**హైదరాబాద్,నవంబర్ 29,ప్రభాతవార్త:** దివ్యాంగులు మానసిక స్థైర్యంతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు.అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం చాదర్ ఘాట్ విక్టోరియా ప్లే గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడోత్సవఫ్లాగ్ ను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు మానసిక స్థైర్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. "హమ్ కిసీ సే కమ్ నహీ" అనే ఆలోచన తప్పక ఉండాలని అప్పుడే మానసిక స్థైర్యం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అలాగే ప్రభుత్వ రంగాల్లో దివ్యాంగుల కోట తప్పక అమలు చేయడం జరుగుతుందని చదువుతో పాటు క్రీడల్లో ఎక్కువగా రాణించి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని అన్నారు. ఈ క్రీడా కార్యక్రమములో దివ్యాంగ విద్యార్థిని, విద్యార్థులు దాదాపు 1500 మంది పాల్గొనటంతో కలెక్టర్ సంతోషం వ్యక్తం చేస్తూ క్రీడల నిర్వహణ సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్రీడల్లో బాలబాలికలు అలాగే మహిళలు, పురుషులకు నాలుగు కేటగిరీలలో మూడు క్రీడాలను షాట్ పుట్, రన్నింగ్, చెస్ పోటీలు అలాగే బధిర, వినికిడిలోపం ఉన్న వారికి షాట్ పుట్ జావలిన్ త్రో, రన్నింగ్, అలాగే మేధోవైకల్యం ఉన్న వారికి షాట్ పుట్, రన్నింగ్ క్రీడలను చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో దివ్యాంగులు అనేక క్రీడల్లో రాణించి దేశం గర్వించదగ్గ విశిష్ట పథకాలను అందుకోవటం జరుగుతుందని వారిని స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో ముందుకు వెళ్లాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు రాజేందర్, దివ్యాంగ సంఘ ప్రతినిధులు కొల్లి నాగేశ్వరరావు, గంగారాం, నారా నాగేశ్వరరావు, పి శ్రీనివాస్ రావు, పి వెంకటేశ్వర్లు, ఎన్జీవో ప్రతినిధులు పిఈటిలు పాల్గొన్నారు.

# నగరంలో సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఏర్పాటు

**-సిపి సజ్జనార్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ సన్నాహాలు**
**-సంచలన, కీలక కేసులను సీఐటీకి అప్పగించాలని నిర్ణయం**
**-దర్యాప్తు వేగవంతం చేయడమే ప్రధాన లక్ష్యం**



**హైదరాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీసు శాఖ దర్యాప్తు ప్రక్రియను మరింత పటిష్టం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకోనుంది. నగరంలో సంచలనం సృష్టించే, కీలకమైన కేసుల విచారణ కోసం ప్రత్యేకంగా సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సీఐటీ)ను ఏర్పాటు చేసేందుకు పోలీస్ కమిషనర్ సజ్జనార్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ కొత్త బృందం ఏర్పాటుతో ముఖ్యమైన కేసుల దర్యాప్తు వేగవంతం అవుతుందని ఉన్న తాధికారులు భావిస్తున్నారు.ప్రస్తుతం అన్ని రకాల కేసులను స్థానిక పోలీస్ స్టేషన్లు, ఇతర విభాగాలు దర్యాప్తు చేస్తున్నాయి. అయితే, సీఐటీ ఏర్పాటు ద్వారా సాధారణ కేసులతో సంబంధం లేకుండా కేవలం సంచలనాత్మక కేసులపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించే అవకాశం ఉంటుంది. ఇది దర్యాప్తులో జాప్యాన్ని నివారించి, నాణ్యతను పెంచుతుందని పోలీసు శాఖ అంచనా వేస్తోంది.ఈ సీఐటీ బృందం బాధ్యతలు కేవలం దర్యాప్తుకే పరిమితం కావు. కేసు నమోదు దగ్గర నుంచి ఆధారాల సేకరణ, కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయడం, ఆ తర్వాత కేసు విచారణ (ట్రయల్) ప్రక్రియను కూడా ఈ టీమ్ నిశితంగా పర్యవేక్షిస్తుంది. కేసు మొదటి దశ నుంచి తుది తీర్పు వెలువడే వరకు పూర్తి బాధ్యత వహించే లా సీఐటీ విధివిధానాలను రూపొందిస్తున్నారు. ఈ నిర్ణయంతో కీలక కేసుల్లో దోషుల కు త్వరగా శిక్ష పడేలా చేయవచ్చని అధికారులు ఆశిస్తున్నారు.

# నవరసభరితం నర్తనరవళి



కూచిపూడి నర్తనరవళి నృత్యప్రదర్శనల్లో దృశ్యం

**రవీంద్రభారతి, నవంబరు 29 ప్రభాతవార్త :** ప్రముఖ కూచిపూడి శిక్షణా సంస్థ కళానికేతన్, వ్యవస్థాపకుడు, దర్శకుడు, గురువు డా. బిందు అభినయ మార్గదర్శకత్వంలో సంస్థకు వివిధశాఖలకు చెందిన 153మంది విద్యార్థుల నృత్యప్రదర్శనలు కూచిపూడి నృత్యశైలి సుగుణ సౌందర్యాలను, నైపుణ్యాన్ని విచ్చేసిన అశేష ప్రేక్షకుల ముందు అద్భుతంగా నవరసభరితంగా నర్తించి ప్రతీఒక్కరి మన్ననలు, ప్రశంసలు అందుకున్నారు. సంస్థ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని నర్తన రవళి శీర్షికతో బషీర్‌బాగ్ కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శనివారం రాత్రి చిన్నారి విద్యార్థులు వినాయక అభినుతి, ఆనందతాండవం, కృష్ణశబ్దం, మార్కండేయ చరిత్ర, వినరో భాగ్యం విష్ణుకథ, అదిగో అల్లదిగో శ్రీహరివాసము, మరకమణిమయ తదితర పలుఅంశాలు అలవోకగా నాట్యవిన్యాస ప్రదర్శనలతో మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన నాట్యగురువు డా. వనజ ఉదయ్, పెండ్యాల భారతి, డి.నారాయణ మూర్తి తదితరులు ముందు సంస్థ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కూచిపూడి.కాంను ప్రారంభించి చివరిగా నేటి నర్తనరవళిలో ప్రదర్శనలిచ్చిన చిన్నారి కళాకారులను ఎంతగానో అభినందించి శుభాశీస్సులందజేశారు.



బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో హీటెక్కించిన అందాల ముద్దుగుమ్మల ఫ్యాషన్ షో

# దీక్షా దివస్ పేరుతో బిఆర్ఎస్ కొత్త డ్రామా

**-పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్**



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో సమావేశమైన పీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు

**హైదరాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త**

రాష్ట్రంలో ఉనికి కోల్పోతున్న బీఆర్ఎస్ పార్టీ, దీక్షా దివస్ పేరుతో కొత్త డ్రామాకు తెరలేపిందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు.శనివారం ఆయన నివాసంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్ నేతతో సమావేశమై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ దీక్ష వల్ల రాలేదని, సోనియాగాంధీ చలవ వల్లే వచ్చిందని పేర్కొన్నారు. 2009లో కేసీఆర్ చేపట్టిన దీక్ష పూర్తిగా నాటకమని వ్యాఖ్యానించారు. కేసీఆర్ బయటికి వస్తే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడిందని, బీఆర్ఎస్ శకం ముగిసిన ముగిసిందని ఆయన అన్నారు.

## వైమానిక దళంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

**- నిందితుడి అరెస్టు**

**సైదాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:**

భారత వైమానిక దళంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులను మోసం చేస్తున్న నిందితుడిని సైదాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ పాట్నాకు చెందిన మహ్మద్ షాజాద్ అలం వైమానిక దళం ఉద్యోగి కానప్పటికీ వైమానిక దళం దుస్తులు ధరించి, తాను వైమానిక దళం ఉద్యోగినని, తనకు వైమానిక దళంలో పెద్ద పరిచయాలు ఉన్నాయని, వైమానిక దళంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులకు, అమ్మాయిలకు మాయ మాటలు చెబుతూ మోసం చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు మహ్మద్ షాజాద్ అలంను అదుపులోకి తీసుకుని విచారించగా తన నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

# రోడ్లను తవ్వి పన్నులను ఆపవద్దు

**-ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



కాచిగూడలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తదితరులు

**హైదరాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజకవర్గంలో గుంతలు లేని రోడ్లుగా రూ పొందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రజలుఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పు డు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం కాచిగూడలో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ రోడ్లను తవ్వి పనులను ఆపవద్దని, తవ్విన వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు, కాంట్రాక్టర్లుకు సూచించారు. బర్కత్‌పురలోని శాలినీ హాస్పిటల్ వద్ద రోడ్ల నిర్మాణం కోసం రోడ్డు తవ్వి వదిలేయడంపై ఆయన అధికారులపై మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితి ఏ కాలనీ, బస్తీల్లో జరగవద్దని హెచ్చరించారు. రోడ్లను తవ్వి నెలల తరబడి వదిలేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అలా జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తనను సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఆయా బస్తీలో స్థానిక నేతలతో కలిసి ఎమ్మెల్యే పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత లు డాక్టర్ బద్దుల ఓంప్రకాష్ యాదవ్, ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, సునిల్ బిడ్లాన్, బి.కృష్ణాగౌడ్, బబ్లూసింగ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, క్షీర్‌సాగర్, భీమ్రాజ్, అరవింద్, ఆర్.సంతోష్, ఎస్. రవియాదవ్, లావణ్య, తారా, తదితరులు పాల్గొన్నారు.

# రోలెక్స్ చేతిగడియారం కాజేసిన కానిస్టేబుల్

**- కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన ఫిలింనగర్ పోలీసులు**

**ఫిలింనగర్, నవంబర్ 29, ప్రభాతవార్త:**

సోదాలకు వెళ్లిన ఒక కానిస్టేబుల్ చేతివాటాన్ని ప్రదర్శించి అరెస్టయిన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఫిలింనగర్ పోలీసుల కథనం ప్రకారం... నవంబర్ 25న ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ ఐఎఎస్, ఐపీఎస్‌గా చలామణి అయిన భత్తుల శశికాంత్‌ను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే షేక్‌పేటలోని నకిలీ ఐఎఎస్ నివసించే ఆదిత్య ఔరా నివాసంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కార్ హెడ్ క్వార్టర్స్‌కు చెంది ప్రస్తుతం ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌కు అటాచ్ అయి ఉన్న కానిస్టేబుల్ శ్రీరాముల శరన్ కుమార్ నిందితుడు బత్తుల శశికాంత్ నివాసంలో తనకు కనిపించిన నకిలీ రోలెక్స్ చేతి గడియారాన్ని కాజేశాడు. ఈ వివరాలను అక్కడున్న అధికారులకు తెలియజేయకుండా చేతి గడియారాన్ని తనతో పాటు తీసుకెళ్లి ఇంట్లో దాచిపెట్టుకున్నాడు. ఈ విషయం కాస్త బయటకు పొక్కడంతో విచారణ చేపట్టిన ఫిలింనగర్ పోలీసులు కానిస్టేబుల్ ఇంట్లో డూప్లికేట్ రోలెక్స్ చేతి గడియారాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కానిస్టేబుల్ శ్రీరాముల శరన్ కుమార్ ఈ విషయాన్ని అంగీకరించారు. దీంతో కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు సంస్కారం గురించి తెలియజేయాలి: ప్రిన్సిపాల్ మల్లేష్



పాదపూజా కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు

**మలక్ పేట, నవంబర్ 29, ప్రభాతవార్త:** తల్లిదండ్రులకు "పాద పూజ" అనే ఆచారం భారతీయ సాంప్రదాయంలో ఎంతో పవిత్రమైనదిగా భావించబడుతుందని బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ ప్రిన్సిపల్ గుణిగంటి మల్లేష్ గౌడ్ తెలియజేశారు. బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ గాయత్రినగర్ బ్రాంచ్ లో శనివారం విద్యార్థులు పాద పూజ కార్యక్రమాన్ని నిర్వహించి తమ తల్లిదండ్రుల పాదాలకు సుగంధ ద్రవ్యాలు, పుష్పాలతో పూజించి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇది చాలా గొప్ప కార్యక్రమమని, పిల్లలకు తల్లిదండ్రులు, పెద్దలపట్ల గౌరవం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ అని నిత్యం శ్లోకాలు పఠిస్తారని, కాని ఆచరణలో కనిపించడంలేదని ,నేటి పిల్లలు తల్లిదండ్రులపట్ల గౌరవ మర్యాదలు చుపించండలేదని, తల్లిదండ్రుల మాటలు పెడచెవిన పెడుతున్నారని అన్నారు. పిల్లలో కనీస పరివర్తన, విలువలు పెంపొందించడంతోపాటు సభ్యత, సంస్కారం నేర్పించడంకోసం ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు సుందరి, మోనిక, శ్రీదేవి, ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆర్మీ పబ్లిక్ పాఠశాలలో ఘనంగా వార్షిక క్రీడా మహోత్సవం



**నేరెడ్ మెట్, నవంబర్ 29, ప్రభాతవార్త:** విద్యార్థి దశ నుంచే భిన్నమైన వాటిలో అద్భుత ప్రతిభను కనబరిచినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని టాసా కార్యాలయం విద్యా విభాగాధికారి బ్రిగేడియర్ జోస్ అబ్రహామ్ పేర్కొన్నారు. శనివారంసికింద్రాబాద్‌లోని ఆర్మీ పబ్లిక్ పాఠశాల ఆర్‌కె పురంలో 25వ వార్షిక క్రీడా మహోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. "కష్టాలను దాటి నక్షత్రాల వైపు" అనే భావంతో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు క్రమశిక్షణ, జట్టు భావం, ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా టాసా కార్యాలయ విద్యా విభాగాధికారి బ్రిగేడియర్ జోస్ అబ్రహామ్, ప్రత్యేక అతిథిగా సిమి సింగ్ పాల్గొన్నారు. జెండా విన్యాసం, జ్యోతి ప్రదక్షిణ, మార్చ్‌పాస్ట్, పరుగుపందేళ్లు, ప్రీప్రాథమికం నుండి పన్నెండో తరగతి వరకు విద్యార్థుల రంగులరంగుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అర్చనా రాయ్ పాఠశాల సంవత్సరాంత ప్రగతిని వివరిస్తూ నివేదికను అందించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేసి ఉత్తమ హౌస్‌ను ప్రకటించారు. జాతీయ గీతంతో ముగిసిన ఈ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహం, ఐక్యత, క్రీడాస్ఫూర్తి నింపాయి.

## రెండు దశాబ్దాల తర్వాత భవన్స్-2000 బ్యాచ్ కలయిక



**నేరెడ్ మెట్, నవంబర్ 29, ప్రభాతవార్త:** నేరెడ్ మెట్ డివిజన్ సైనికపురి భవన్స్ వివేకానంద కాలేజీలో 1997-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సిల్వర్ స్పార్క్స్ స్నేహసమ్మేళనం శనివారం సందడిగా జరిగింది. ఇరవైఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకరిని ఒకరు పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను తలచుకుని ఆనందంలో మునిగిపోయారు. జితేంద్ర, పంకజ్, అరవింద్ స్వాగతంతో వేడుకకు శ్రీకారం చుట్టగా, సరస్వతి పూజతో కార్యక్రమం ప్రారంభమైంది. ప్రిన్సిపల్ డా.జి.ఎస్.వి.ఆర్.కె.చౌదరి, ముఖ్య అతిథి ప్రొఫెసర్ వై.అశోక్ పూర్వ విద్యార్థులను ఉద్దేశించి సంస్థ విలువలు, వారసత్వాన్ని గుర్తుచేశారు. డా.ఉమా, డా.గణేష్, డా.శ్రీలత రెడ్డి సహా పదవీ విరమణ చేసిన అధ్యాపకులు, సీనియర్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. పంకజ్, గగన్ సమన్వయంతో నిర్వహించిన జ్ఞాపకాల పర్వం పూర్వ విద్యార్థుల్లో పాత కాలేజీ రోజులను కళ్లముందుకు తెచ్చింది. నృత్యం, గానం, సంగీత కార్యక్రమాలు వేడుక రసాన్ని మరింత పెంచాయి. కార్యక్రమం చివరలో ఎం.ప్రసన్న కృతజ్ఞతా ప్రసంగం చేశారు. ఇరవైఏళ్ల అనుబంధాన్ని మరలా బలోపేతం చేస్తూ 2000 బ్యాచ్ స్నేహసమ్మేళనం పాల్గొన్న వారందరికీ చిరస్మరణీయంగా నిలిచింది.

### బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

**: భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మధుసుదన్ రెడ్డి**



బిజెపి నాయకులు బొక్క మధుసూదన్ రెడ్డి, వంజరి వినోద్ కుమార్, చందు ప్రదీప్ కుమార్, కొప్పుల దినేష్ తదితరులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

**మలక్ పేట, నవంబర్ 29, ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని భాగ్యనగర్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బొక్కా మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుపరచకుండా స్థానిక ఎన్నికలకు వెళ్లడాన్ని నిరసిస్తూ బిజెపి భాగ్యనగర్ జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో బిజెపి నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి మలక్ పేట పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బొక్క మదుసుదన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చ, బీజేపీ నాయకులుచందు ప్రదీప్ కుమార్, నరసింహ, నరేష్ యాదవ్, లింగాల హరి గౌడ్, గౌర దేవేందర్, కొప్పుల దినేష్, యాదగిరి సురేందర్ , కిరణ్, శాస్త్రీ, రాజేష్, వంజరి వినోద్ కుమార్, రమన్ సింగ్, చందు, శ్రీనివాస్, పరశురాం, పాల్గొన్నారు.

## యోగా ద్వారా మానసిక ప్రశాంతత : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



రామంతాపూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్‌జిల్లా యోగాసన చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రమేష్ తదితరులు

**రామంతాపూర్, నవంబరు 29 ప్రభాతవార్త :** యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరు యోగా అలవర్చుకోవాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం రామంతాపూర్ ఆరోరా కళాశాలలో జరుగుతున్న 12వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లా యోగాసన చాంపియన్ షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఆరోరా సంస్థల చైర్మన్ నిమ్మటూరి రమేష్, తెలంగాణ యోగా అసోసియేషన్ అధ్యక్షుడు రవి స్వామి, కార్యదర్శి బ్రిజ్ భూషణ్ పురోహిత్, కోశాధికారి కె.దత్తాత్రేయరావు, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.సురేంద్ర నాదజ్, కె.మల్లేష్‌గౌడ్, పి.రవికిషోర్, తెలంగాణ యోగా టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా.దోర్ల సత్యారెడ్డి, సురేంద్రనాథ్, నిత్యానంద్, రవికాంత్ తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ యోగా సాధన చేస్తున్న వారికి ప్రోత్సాహాన్ని అందించాలని, యోగా అనేది శారీరక వ్యాయామమే కాదని, ఒక జీవన విధానం అన్నారు. గత గత నలభై ఏళ్లుగా ప్రతి రోజు యోగా సాధన చేస్తున్నాని, ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. యోగా అన్ని మతాలకు చెందినదని, అమెరికా, యూరోప్, గల్ఫ్ దేశాలలోని ప్రజలు యోగాను సాధన చేస్తున్నారని తెలిపారు. యునెస్కో కూడా యోగాను అవ్యక్త సాంస్కృతిక వారసత్వంగా గుర్తించిందని, యోగా ధ్యానం నిత్యం సాధన చేయడం ద్వారా మనిషిలో ఒత్తిడి, ఆందోళనలు తగ్గి మానసికంగా ప్రశాంతంగా ఉంటారని తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యోగా పోటీలు తన ప్రాంతంలో నిర్వహించడం అభినందనీయమని, వారికి తగు సహకారం అందిస్తానని తెలిపారు. ఆరోరా సంస్థల చైర్మన్ నిమ్మటూరి రమేష్ మాట్లాడుతూ యోగా ద్వారా విద్యార్థుల కు మేలు జరుగుతుందన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గత నవంబర్‌లో జరిగిన 39వ ఇంటర్ స్కూల్ కళాశాల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యోగా గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యాదవులు అన్ని రంగాలలో అభ్యున్నతి సాధించాలి : ఎంపీ అనిల్ కుమార్ యాదవ్



ఐక్యతను చాటుతున్న శ్రీశైలం యాదవ్, చింతల రవీంద్రనాథ్ యాదవ్

**ఎల్.బి.నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** యాదవ కులస్తులు అన్ని రంగాలలో అభ్యున్నతి సాధించాలని అందుకు అవసరమైన సహకారాన్ని తాను అందిస్తానని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నాగోల్ శుభం కన్వెన్షన్ సెంటర్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఘన విజయం సాధించిన వల్లాల నవీన్ యాదవ్ కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు కలిసికట్టుగా ఉంటూ మన హక్కులను సాధించుకోవాలని అన్నారు. యాదవుల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యుడు, ఆర్టిఏ మాజీ చీఫ్ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలో యాదవ కులస్తులకు ఒక రాజ్యసభ స్థానం కల్పించడంతో పాటు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించి కాంగ్రెస్ పార్టీ గెలిపించుకోవడం యాదవ కులానికి ఇస్తున్న గౌరవాన్ని అభినందించారు. ఎమ్మెల్యే నవీన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఎన్నికలలో తనకు అవకాశం ఇచ్చిందని ప్రజలు తనను ఆశీర్వదించారని, ప్రజలు, పార్టీ తనకు ఇచ్చిన అవకాశాన్ని నమ్ము చేయకుండా అంకితభావం పనిచేస్తానని అన్నారు. ఈ సందర్భంగా గజమాలతో నవీన్ కుమార్ యాదవ్ ను యాదవ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వల్లాల చిన్న శ్రీశైలం యాదవ్, మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్, ఆర్.లక్ష్మణ్ యాదవ్, యశ్వంత్ యాదవ్, డి.శ్రీనివాస్ యాదవ్, ఎం.రాజేందర్ యాదవ్, కుల సంఘం ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యక్రమానికి పెద్దఎత్తున హాజరయ్యారు.

## తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో " అనే నినాదమే ఉద్యమానికి ఊపిరి



ఫిర్జాదిగూడ దీక్షా దివస్ లో మాజీ మంత్రి మల్లారెడ్డి , జక్కా వెంకట్ రెడ్డి , మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి ,మహేష్ బిఆర్ఎస్ నాయకులు తదితరులు

**మేడిపల్లి, నవంబర్ 29 ప్రభాతవార్త ;** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన "దీక్షా దివాస్" కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి, అమరవీరుల స్తూపానికి పుష్పాంజలి ఘటించి అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం కోసం కేసీఆర్ ఇదే రోజు 2009 నవంబర్ 29న స్వచ్ఛ తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తానని ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొని తన చావును సైతం లెక్కచేయకుండా నీళ్లు, నిధులు, నియామకల కోసం తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి పరచడం కోసం ఆంధ్ర వలస వాదులపై అప్పటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై విరామం ఎరగని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహా యోధుడుగా పేరు పొందారన్నారు. కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టులను నిర్మించి బీడు భూములను సైతం పచ్చని పొలాలుగా మార్చిన ఘనత కేసీఆర్ కే దక్కిందని, మిషన్ కాకతీయ ద్వారా చెరువులను నింపి సస్యశ్యామలం చేసి పంటలకు అందించిన అపర భగీరధుడుగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏదవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరు మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు జిలాని పాష, జావిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు టికెఆర్ కాలేజీలో నవచండీ పూర్వక సుదర్శన లక్ష్మీ సహిత రుద్రయాగం

**-లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న తీగల కృష్ణారెడ్డి**



యాగానికి హాజరైన మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కెఎల్ఆర్, కార్పొరేషన్ల ఛైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయర్, హుడా మాజీ ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డి తన స్వగ్రామం మీర్‌పేట్ మేడిబౌలిలో శనివారం నవ గుండాత్మక నవచండీ పూర్వక సుదర్శన లక్ష్మీ సహిత రుద్రయాగాన్ని ఘనంగా నిర్వహించారు. టికెఆర్ విద్యా సంస్థల ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న తీగల కళాశాలల క్యాంపస్‌లోని మైదానంలో తన సతీమణి తీగల అరుంధతి, కుమారులైన టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ తీగల హరినాథ్‌రెడ్డి, ట్రెజరర్ తీగల అమర్‌నాథ్‌రెడ్డి, కోడళ్లు అయిన రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి, తీగల తులసి రెడ్డి, కుమార్తె హరితారెడ్డి, మనుమలు, మనుమరాళ్ళతో పాటు పలువురితో కలిసి ఈ మహా యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుడు ఉప్పల ఫణీంద్ర శర్మ తన బృంద పండితులతో కలిసి వారందరిచే నియమ నిష్ఠలతో యాగ కార్యక్రమాలను జరిపించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన యాగం మధ్యాహ్నం రెండు గంటల వరకు సాగింది. అనంతరం విరామం తర్వాత సాయంత్రం 4.30 గంటలకు పునః ప్రారంభమై రాత్రి వరకు సాగింది. తీగల కుటుంబ సభ్యులతో పాటు గడ్డమీది లక్ష్మీ నర్సింహారెడ్డి గురుస్వామి, గన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బుడుగం రిషికేష్‌రెడ్డి, చల్లూరి వెంకట్‌రామిరెడ్డి, జె.సంతోష్‌రెడ్డిలు యాగ పూజలు చేశారు.

**లోక కళ్యాణార్థం యాగం నిర్వహించా: తీగల కృష్ణారెడ్డి**

లోక కళ్యాణార్థం ప్రతిష్టాత్మకంగా నవ గుండాత్మక నవచండీ పూర్వక సుదర్శన లక్ష్మీ సహిత రుద్రయాగాన్ని నిర్వహిస్తున్నామని తీగల కృష్ణారెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజలపై, తన స్వగ్రామం మీర్‌పేటలోని కుటుంబాలపై, తమ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, పని చేస్తున్న వారిపై జగన్మాత ఆశీర్వాదం ఉండాలనే ఈ మహా యాగాన్ని తలపెట్టానని ఆయన వెల్లడించారు. ఈ యాగంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కెఎల్ఆర్, కార్పొరేషన్ల ఛైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్, సరూర్‌నగర్ మాజీ ఎంపిపిలు సామల రంగారెడ్డి, గుర్రం నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, రాజకీయాలకతీతంగా పలువురు ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, దేవీ భక్తులు పాల్గొన్నారు.

### పేరెంట్ అండ్ చైల్డ్ ట్విన్నింగ్ డ్రెస్ కాంపిటేషన్



ట్విన్నింగ్ డ్రెస్ కాంపిటేషన్‌లో తమ పిల్లలతో కలిసి పాల్గొన్న తల్లిదండ్రులు

**సరూర్‌నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ హెడ్ క్వార్టర్ అయిన కార్పొరేషన్ కార్యాలయ చౌరస్తా సమీపంలోని బ్రైటెన్ బ్లూమ్స్ స్కూల్‌లో శనివారం పేరెంట్ అండ్ చైల్డ్ ట్విన్నింగ్ డ్రెస్ కాంపిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉల్లాసభరితంగా సాగిన ఈ పోటీల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వివిధ రకాలకు సంబంధించి ఒకే తరహాలో ఉన్న డ్రెస్‌లు ధరించి అలరించారు. ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగిన ఈ పోటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల అనంతరం పాఠశాల డైరెక్టర్లు జ్యోత్స్న, మాలతిలు పోటీల్లో గెలిచిన విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొనేందుకు ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ శ్రావ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జలమండలి ఎండితో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ బేటి



జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 29 ప్రభాతవార్త :** జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో శనివారం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల్ కురుమనగ ర్‌లో నిర్మిస్తున్న సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంటు విషయంపై చర్చించారు. సివరేజీ ట్రీట్ మెంట్ ప్లాంట్ వల్ల స్థానికులకు ఇబ్బందులకు గురిఅవు తున్నారని, ప్లాంటు మరో చోటకు తరలించాలని సూచించారు. అదే విధంగా ఉప్పల్ నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారైందని, కొత్త కాలనీలు విస్తరించాయని, నాలాలు పొంగుతున్నాయని ఫిర్యాదు చేశారు. అదే విధంగా భూగర్భ డ్రైనేజీని అధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకుని వస్తానని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నీటి రిజర్వాయర్లు నిర్మించా నని, భారీ ఎత్తున నిధులు తెచ్చానని గుర్తు చేశారు. దీనిపై జలమండలి ఎండి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎస్టీపి స్థలాన్ని మార్చేందుకు ముగ్గురు సాంకేతిక సభ్యులతో కూడిన బృందాలను పంపిస్తానని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, సీనియర్ నేతలు మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణగౌడ్, పోతగోని గోపాల్‌గౌడ్, శ్రీశైలం రాజు మంగ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కులో సుందరీకరణ పనులు ప్రారంభం



**మల్కాజిగిరి నవంబర్ 29, ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పివిఎన్ కాలనీలోని పార్కును కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్కు లోపల సుందరీకరణ పనులు ప్రారంభించామన్నారు త్వరలోనే జిమ్ పరికరాలను ఏర్పాటు చేస్తామని కాలనీ లో పెండింగ్లో ఉన్న రోడ్ల డ్రైనేజీ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యలక్ష్మి వర్క్ ఇన్స్పెక్టర్ రజనీ కాంత్ పీ వీ ఎన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వేముల వెంకటేష్, యాదగిరి రెడ్డి, బాల్ రెడ్డి, నర్సరాజు, శ్రీరాములు, బుచ్చయ్య, నరసింహారెడ్డి, దశరథ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బాబు సత్యనారాయణ సంపత్ రావు కిషోర్, వినయ్, ఎస్ఎఫ్ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

### ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ అండ్ హ్యాండిక్రాఫ్ట్ మేళా



హ్యాండ్లూమ్ అండ్ హ్యాండిక్రాఫ్ట్ మేళాలో మహిళలు

**వనస్థలిపురం. నవంబర్.29.ప్రభాతవార్త.** వనస్థలిపురం హుడా ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండిక్రాఫ్ట్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటున్నది. ఈ ప్రదర్శన లో చేనేత కార్మికులు తయారుచేసిన మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి చీరలు, భాగలపూర్, డిజైనర్ చీరలు ,కాంతా వర్క్స్, హాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, కలంకారి, బెంగాలీ కాటన్ చీరలు ,లేడీస్ ఫాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజస్, లక్నో బెనారస్ చీరలు, ఖాధి మెటీరియల్స్, వన్ గ్రామ్ గోల్డ్ జెవెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు తదితర వస్తువులు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రదర్శన కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని నిర్వాహకులు అలీ తెలిపారు.

### కెసిఆర్ ఆమరణ దీక్షతో తెలంగాణ ఆవిర్భావం



పండ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

**హయత్ నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త :** తెలంగాణ చరిత్రలో 2009 నవంబర్ 29న తిరుగు బాటు జ్వాల పుట్టిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హయత్ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మెగా హెల్త్ క్యాంపు, పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సుదీర్ రెడ్డి మాట్లాడుతూ.... కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న ఒక్క మాటతో మిలియన్ల హృదయాలు ఒక్కటయ్యాయని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం వారి గౌరవం కోసం వారి భవిష్యత్తు కోసం ఉద్యమ నేతగా కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహర దీక్ష తో కేంద్రం దిగివచ్చిందన్నారు. అనంతరం కేసీఆర్ గారి చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి, డివిజన్ కమిటీ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్, మల్లీశ్వరి రెడ్డి, భాస్కర్ సాగర్, శ్రావణ్, అంజలీ, స్కైలాబ్, ప్రదీప్, రాకేష్, రమేష్ పాల్గొన్నారు.

### లింగోజిగూడలో ఓపెన్ జిమ్‌లు ప్రారంభం



చిన్నారులచే ఓపెన్ జిమ్‌ను ప్రారంభింప చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ సిఎం రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల వెనుక వైపు రూ.15లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలలో ఇప్పటికే నూతన రోడ్లు, యుజిడి, వీది దీపాలు, పార్కులు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు తమ ప్రాంతాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చి వాటి సత్వర పరిష్కారానికి తోడ్పాటునందించాలని కార్పొరేటర్ రాజశేఖరరెడ్డి కోరారు. కార్యక్రమంలో పరిసర కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

**జ్యోతి క్లబ్ పక్కన..**

జ్యోతి క్లబ్ పక్కన రూ.15లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకప్పుడు చెత్తా చెదారంతో నిండిపోయి మూత్ర విసర్జన ప్రాంతంగా ఉన్న స్థలాన్ని అభివృద్ధి చేసి స్థానికులకు ఉపయోగపడేలా ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డాబర్ చవన్ ప్రాశ్ పంపిణీ



**సరూర్‌నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం రోగ నిరోధక శక్తిని పెంచే డాబర్ చవన్ ప్రాశ్‌ను పంపిణీ చేశారు. డాబర్ ఇండియా లిమిటెడ్ హెల్త్ కేర్ డైరెక్టర్ శ్రీరామ్ పద్మనాభన్ దాదాపు 250 మంది విద్యార్థులకు డాబర్ చవన్ ప్రాశ్ డబ్బాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యాధినిరోధక శక్తిని పెంపొందించే ఉద్దేశ్యంతో డాబర్ ఉచితంగా వీటిని పంపిణీ చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, సత్తయ్య, పలువురు ఉపాధ్యాయులు, డాబర్ ఇండియా ప్రతినిధి దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 29 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో రూ.5.33 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. అవసరమైన చోట నూతన యుజిడి, రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శిశుపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సరళ, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాంరెడ్డి, విజయ్, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**విష్ణునగర్‌లో..** ఐఎస్ సదన్ డివిజన్ విష్ణునగర్‌లో రూ.8.50 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను, రూ.9.41లక్షల వ్యయంతో చేపడుతున్న ఫుట్‌పాత్ నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కృష్ణయాదవ్, కదారి బిక్షపతి యాదవ్, ప్రకాష్, బన్ని, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందికి సత్కారం



**నేరెడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, నవంబర్ 29,ప్రభాతవార్త:** పోలీస్ సేవ అనేది సవాళ్లతో కూడుకున్నదని, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ దీర్ఘకాలం క్రమశిక్షణతో పనిచేసిన వీరి సేవలు ప్రశంసనీయం సి పి సుధీర్ బాబు అన్నారురాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేసి శనివారం పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు సిబ్బందిని సిపి సుధీర్ బాబు ఐపీఎస్ ఘనంగా సన్మానించారు. చైతన్యపురి నుండి ఎస్.నిరంజన్ (పోలీస్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్), అంబర్‌పేట్ నుండి ఎన్. మన్మద్ కుమార్ (రిజర్వ్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్), సిపి కార్యాలయానికి చెందిన ఎన్. ప్రసాద్ రావు (హెడ్ కానిస్టేబుల్)లను గుర్తింపుగా సత్కరించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. . పదవీ విరమణ అనంతరం ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ ప్రశాంత జీవితం గడపాలని సూచించారు. పెన్షన్ తదితర ప్రయోజనాలు త్వరగా అందేలా సంబంధిత శాఖలను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ ఇందిరా, అదనపు డీసీపీ శివకుమార్, సీఏఓ పుష్పరాజ్, ఏఏఓ అశోక్‌రెడ్డి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి, సహకార సంఘం ఏఓ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

### తెలంగాణ చరిత్రలో తిరుగుబాటు దీక్షా దివస్



వైద్య శిబిరంలో పాల్గొన్న సుధీర్ రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్

**ఎల్.బి.నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** దీక్షా దివస్ సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ వీవీనగర్ బస్ స్టాప్ వద్ద మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం, మెగా హెల్త్ క్యాంపు కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథి హాజరై మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో తిరుగుబాటు జ్వాల పుట్టిన నవంబర్ 29న కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో ఒక మాటతో మిలియన్ల హృదయాలు ఒక్కటయ్యాయన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష, గౌరవం, భవిష్యత్తు కోసంఉద్యమనేత కేసీఆర్ చేపట్టిన అమరణ నిరాహార దీక్ష అన్నారు. తెలంగాణ కోసం కెసిఆర్ శ్వాస, జీవితం, పోరాటం, దీక్షా దివస్ మన గౌరవం, గ ర్వం అన్నారు. కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్, శ్రీశైలం యాదవ్, శైలజ, రమణారెడ్డి, రాము, యాద శంకర్, ప్రదీప్, విక్కి, విజయ, శివ కుమార్, వర్షిత్, వాణి, నాగమణి, లక్ష్మీ పాల్గొన్నారు.

## హైకోర్టు కాలనీ రోడ్డు మూసివేతపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఫిర్యాదు



ఉప్పల్ హైకోర్టు కాలనీ రోడ్డు మూసివేతపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బిఆర్ఎస్ నేత పల్లె రాజ్‌కుమార్‌గౌడ్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ హైకోర్టు కాలనీ నుంచి హెచ్ఎంటినగర్‌కు వెళుతున్న రోడ్డును మూసివేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కాలనీ సంఘం నేతలు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పల్లె రాజ్ కుమార్‌గౌడ్, కె.అంజిరెడ్డి, సాయికృష్ణ, పి.వెంకట్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.కిషోర్ తదితరులు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ హైకోర్టు కానీ నుంచి హెచ్ఎంటినగర్‌కాలనీకి వెళ్లే రహదారిని అభివృద్ధి చేశారని, అయితే కొందరు రాత్రి వేళలలో మూసివేస్తున్నారని తెలిపారు. దీని వల్ల ఇతర ప్రాంతాల మీదుగా వెళ్లాల్సి వస్తుందన్నారు. రోడ్డు తెరిపించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ నేతలు పాల్గొన్నారు.

### మానస పిల్లలతో ఒరాకిల్ ఉద్యోగుల బృందం

**ఎల్.బి.నగర్, నవంబర్ 29 ప్రభాతవార్త:** ఒరాకిల్, ఇండస్ట్రియల్ గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ యూనిట్ హైదరాబాద్‌కు చెందిన 30 మంది ఉద్యోగుల బృందం సేవా కార్యక్రమంలో భాగంగా కొత్తపేటలోని మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా వారు పిల్లలతో కలిసి ఆర్ట్, క్రాఫ్ట్ కార్యకలాపాలు, ఆటపాటలు, తోటపనులు వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రత్యక తరగతులు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ విభాగాలను తిలకించారు. ఈ సందర్భంగా ప్రతీక్ పరాశర్, సీనియర్ డైరెక్టర్, మాట్లాడుతూ మానస ప్రత్యేక పాఠశాల పిల్లలతో గడిపిన సమయం తమ బృందానికి మానసిక దివ్యంగ పిల్లల సామర్థ్యాలు, ప్రత్యేక అవసరాలు, సవాళ్లను అర్థం చేసుకునే విలువైన అవకాశాన్ని కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వై. మురళీధర్, వినీత్ రెడ్డి, గురుగేందర్ సింగ్, డి.వాహీద్, టీం ఎం. రామపండరినాథన్, నమ్రత పాల్గొన్నారు